Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143

Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 186 | Tuesday : 02.07.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :186 | బుధవారం 2 జూలై 2025 | వెల : 3 | పేజీలు : 4

WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి సెల్ : 9440815774

## ఊహాజనిత కారణాలు

# చెప్పకండి





- ప్రమాద ఘటనపై సీఎం సీరియస్
- భద్రతా ప్రమాణాలపై సీఎం ఆరా
- 24 గంటలు దాటినా రాని సిగాచీ యాజమాన్యం
- పాశమైలారం ప్రమాద ప్రాంతంలో భవన శిథిలాలు పరిశీలించిన సీఎం
- ప్రమాద ఘటనపై సహాయ చర్యల గురించి అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి
- సీఎం వెంట మంత్రులు వివేక్, శ్రీధర్‌బాబు, పొంగులేటి, రాజనర్సింహ

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామికవాడలో సిగాచీ పరిశ్రమ ప్రమాద స్థలాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. ప్రమాద ఘటనపై అధికారులతో మాట్లాడిన ఆయన సహాయ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రులు వివేక్, శ్రీధర్‌బాబు, పొంగులేటి, రాజనర్సింహలతో సీఎం ప్రమాద ప్రాంతంలో భవన శిథిలాలను పరిశీలించారు. అనంతరం ప్రమాద స్థలంలో సీఎం రేవంత్ రెడ్డి మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరిశ్రమకు అనుమతులు, భద్రతా ప్రమాణాలపై సీఎం ఆరా తీశారు. పరిశ్రమలో తరచుగా తనిఖీలు చేశారా? ఈ పరిశ్రమలో గతంలో ప్రమాదాలు జరిగాయా? అని అధికారులను అడిగారు. పరిశ్రమ కార్మికులకు - మిగతా3లో



## నేషనల్ స్పోర్ట్స్ పాలసీకి గ్రీన్‌సిగ్నల్

- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..
- దేశంలోని క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి
- ఉపాధి లింక్డ్ ప్రోత్సాహక పథకానికి కేబినెట్ ఆమోదం




## ఇకపై అన్నిసేవలు ఒకేచోట..!

- భారతీయ రైల్వే సూపర్ యాప్ 'రైల్ వన్' వచ్చేసింది..!
- భారతీయ రైల్వే వివిధ అన్ని సేవలను ఒకే చోట ఏకీకృతం చేస్తుంది



## తమిళనాడులో భారీ పేలుడు..

- 8 మంది మృతి
- 15 మందికి తీవ్ర గాయాలు
- పేలుడు ధాటికి సత్తూరులోని బాణసంచా యూనిట్‌పై దట్టమైన పొగ

## 'సూపర్‌సిక్స్' అమలుకు

# కట్టుబడి ఉన్నాం



- గ్రామాలు కళకళలాడేందుకు పింఛన్లే ప్రధాన కారణం.. గత ప్రభుత్వ హయాంలో జీతాలు, పింఛన్లు సరిగా ఇవ్వలేదు
- తాము పేదలను ఆదుకునేందుకు 'పేదల సేవలో' కార్యక్రమం చేపట్టాం..
- పింఛన్ల కోసమే నెలకు రూ.2,750 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- 'పోలవరం' పూర్తిచేసే బాధ్యతను దేవుడు మళ్లీ నాకే ఇచ్చాడు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మలకపల్లి**

ప్రతినెలా ఒకటో తేదీన గ్రామాలు కళకళలాడేందుకు పింఛన్లే ప్రధాన కారణమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా మలకపల్లిలో సీఎం పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామన్నారు. ఈ సందర్భంగా వేదికపై సీఎం డప్పు కొట్టారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు, పింఛన్లు సరిగా ఇవ్వలేదని చంద్రబాబు అన్నారు. తాము పేదలను ఆదుకునేందుకు 'పేదల సేవలో' కార్యక్రమం చేపట్టామని తెలిపారు. - మిగతా3లో



## పాశమైలారం ఘటన

# దురదృష్టకరం

- ఈ సంస్థ ఫార్మా కంపెనీలకు రా మెటీరియల్ అందిస్తుంది
- గతంలో సైతం ఒక పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ కారణంగా 11 మంది చనిపోయారు
- ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఉన్నతాధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేయాలి

## రేవంత్‌కు జ్ఞానోదయం చేసింది

# బీఆర్ఎస్ పార్టీయే కదా..

- సీఎంకు హరీశ్‌రావు కౌంటర్..!
- ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు తిరస్కరించే వరకు అలుపెరుగని పోరాటం చేసింది బీఆర్ఎస్ పార్టీయే
- ఏపీ అనుమతుల కోసం సీడబ్ల్యూసీకి వెళ్లే కంటే ముందే అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లాలనే సోయి కూడా సీఎంకు లేదు
- కనీస అవగాహన లేని వ్యక్తులు నీటి పారుదల శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్**

ఏపీ నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో కాంగ్రెస్ సర్కారును మొద్దునిద్ర నుంచి లేపింది.. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు తిరస్కరించే వరకు అలుపెరుగని పోరాటం చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని - మిగతా3లో



## ప్రభుత్వంలో నాయకత్వ మార్పు ఉండదు

- ఊహాగానాలకు తెరదించిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే
- ప్రస్తుతం తమ దృష్టంతా స్థానిక సంస్థల ఎన్నికలు, 2028లో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికలపై ఉంది
- తాను నాయకత్వ మార్పును కోరుకోవడం లేదు
- ముఖ్యమంత్రి పదవి కోసం తనకు ఏ ఎమ్మెల్యే మద్దతు అవసరం లేదు

## ఆగస్టు 15 నుంచి మహిళలకు

# ఉచిత బస్సు ప్రారంభిస్తున్నాం



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలను అమలు చేయడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండల ఉమిలాడ పంచాయితీ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఉదయాన్నే మంత్రి పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. తొలుత పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో 2023 నుంచి వితంతు పింఛన్లు నిలిపి వేశారని ఆరోపించారు. దీనికి 'స్పౌజ్ కేటగిరీ'గా నామకరణం చేశామని వచ్చే నెల నుంచి వితంతు పింఛన్లు అందజేస్తామని వెల్లడించారు. చదువుకునే ప్రతి విద్యార్థికి 'తల్లికి వందనం' పథకం కింద పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం అమలు చేసి తల్లుల ఖాతాల్లో నగదు వేయడం - మిగతా2లో

## మద్యం తాగి వాహనాలు నడిపిన
# 14 మందికి భారీజరిమానా విధింపు

**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 01:**



జిల్లా ఎస్పీ వి.ఎన్ మణికంఠ చందోలు, ఆదేశాల మేరకు చిత్తూరు సబ్ డివిజన్ డి.ఎస్పీ శ్రీ టి.సాయినాథ్ ఆద్వర్యంలో చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీ నిత్య బాబు నిన్నటి దినం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 14 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం రోజు ఉదయం ప్రవేశపెట్టగా జడ్జ్‌కుమారి ఉమాదేవి వాహనదారులకు 14 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం1,40,000/- రూ.లు జరిమానా విధించడం జరిగింది.ఈ 1 సం.7 నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన 1625 మందికి సుమారు 1 కోటి 62 లక్షల 50 వేల(1,62,50,000) రూపాయల ఫైన్ విధించడం జరిగింది. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లా లోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు. మద్యం తాగి వాహనంనడపడం అత్యంత ప్రమాదకరం, ఇది మీ ప్రాణాలకు,ఇతరులప్రాణాలకు ప్రమాదం కలిగిస్తుంది.మద్యం సేవించిన వ్యక్తి డ్రైవింగ్ చేయడంపై సెక్షన్185 క్రింద మొదటిసారి నేరంచేస్తే రూ.10,000/-జరి మానా,లేదా 6నెలల జైలు శిక్ష,లేదారెండును విధించవచ్చు, రెండవసారి నేరంచేస్తే రూ.15, 000/- లేదా 3 సం.ల జైలు శిక్ష, లేదా రెండును విధించవచ్చునని కావున వాహనం నడిపే సమయంలో వాహనదారులురోడ్డుభద్రతా రహదారి నిభందనలు తప్పక పాటించి ప్రమాదాలు, జరిమానా లు, శిక్షలకు గురి కాకుండా ఉండాలని ఇన్స్పెక్టర్ కోరారు.

# బిజెపి ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు పీవిఎన్ మాధవ్‌ని కలసిన బిజెపి నాయకులు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 01:**
బిజెపి ఆంధ్రరాష్ట్ర అధ్యక్షులుగా నేడు ఎన్నికైన పీవిఎన్ మాధవ్‌ని మంగళవారం రోజు విజయవాడలో జరిగిన, సమావేశంలో సత్కరిస్తున్న చిత్తూరుజిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు యస్. జగదీశ్వర నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శులు అట్లూరి శ్రీనివాసు, తులసీనాధ్, యస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.బాబు, యస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రవికుమార్, స్టేట్ ఎక్జిక్యూటివ్ మెంబెర్ ఆంజనేయప్ప స్టేట్ కౌన్సిల్ మెంబర్ కాశీనాథ్ మండల అధ్యక్షులు గజేంద్ర వడివేలు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జూలై 2న కుప్పం విచ్చేయనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి!
## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఐఏఎస్



**చిత్తూరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 01:**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా జూలై 2న కుప్పంకు విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య మంత్రి పర్యటనలో భాగంగా జూలై 2న మ 12:30 గం.లకు శాంతిపురం మండలం తుంసిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుంటారని, అనంతరం మ 12.50 గం.లకు తుంసిలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణం చేరుకుని బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. బహిరంగ సభవేదిక వద్ద పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాల అనంతరం ఎంఓయూలు కుదుర్చుకోవడం, వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్‌లు పరిశీలిస్తారన్నారు. బహిరంగ సభ అనంతరం సా.4.30 గం.లకు శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లి చేరుకొని ఇంటింటికి పర్యటించనున్నారని తెలిపారు. తదుపరి సాయంత్రం 7.05 గం.లకు ముఖ్యమంత్రి నివాసం చేరుకును రాత్రి బస చేస్తారన్నారు. కార్య క్రమంలో రెండవ రోజైన జూలై 3న గురువారం ఉ.10:30 గం.లకు కుప్పం ఏరియా హాస్పిటల్ చేరుకొని టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించనున్నారని, అనంతరం మ. 12.15 గం.లకు ముఖ్యమంత్రి స్వగృహం చేరుకొని అధికారిక సమీక్షలు నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమాలను ముగించుకొని సా 4.10 గం.లకు తుమ్మిసి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుని బెంగళూరు తిరుగు ప్రయాణం అవుతారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# దక్షతకు మారుపేరు ఏపీ సీఎం చంద్రబాబు
## పింఛన్ల పంపిణీ పంపిణీ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

**చిత్తూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూన్ 01:**



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దక్షతతోనే ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం సూపరి పాలనకు తొలి అడుగేసిందని చిత్తూరు పార్లమెంటుసభ్యులు దగ్గు మళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ కొనియాడారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరు వచేసి, ప్రశంస లందుకుంటోందని వారు తెలిపారు. అందుకే మాది ప్రజల మెచ్చిన మంచి ప్రభుత్వమన్నారు. మంగళవారం చిత్తూరులోని సియంకె రోడ్డు, కె.ఆర్. పల్లిలో నిర్వహించిన ఎన్టీ ఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్. .పాల్గొన్నారు. వృద్దులు, ప్రత్యేక ప్రతిభా వంతులు, ఒంటరి మహిళలు, కిడ్నీ బాధితులకు పింఛన్లను పంపిణీ చేశారు. ప్రజా శ్రేయస్సే పరమా వధిగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వం.., ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. అనంతరం ఎంపీ దగ్గు మళ్ళ, ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షే మమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కేంద్రప్రభుత్వసహకారంతో ఏ ప్రభుత్వం చేయ లేని పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు సంయుక్త ఆధ్వర్యంలో కొనసా గడం శుభపరిణామం అన్నారు. పేదలు లేని సమాజ స్థాపనే మా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ సర్వతో ముఖా భివృద్ధికోసం సంస్కరణలకు శ్రీకారంచుట్టి. ఏడాదిలోనే అద్భు తమైన వృద్ధిని వృద్ధిరేటును సాధించడం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలన దక్షత, చిత్తశుద్ధికి నిదర్శనం అని కొనియాడారు.

# తిరుపతి సిజీఎస్‌టి కమిషనరేట్ 8వ వార్షికోత్సవ వేడుకలు
## - పన్నుల చెల్లింపులలో అగ్రశ్రేణి సంస్థలుగా ఇసుజు మోటార్స్, మరికొన్ని సంస్థలకు అవార్డులు

**శ్రీసిటీ, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 01:**
తిరుపతిలోని సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీ సెస్ ట్యాక్స్ (సిజిఎస్‌టి) కమిషనరేట్ పరిధిలో వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తిరుపతి కార్యాలయ ఆవ రణలో "సరళీకృత పన్నులు, పౌరుల సాధికారత" అనే థీమ్‌పై ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన అవార్డుల కార్యక్రమంలో పన్నుల చెల్లింపులలో అగ్రశ్రేణి సంస్థలుగా గుర్తించిన ఏడు గురిలో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు అవార్డు దక్కింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా హాజరైన శ్రీసిటీ మేనే జింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, తిరుపతి కమిషనరేట్ అదనపు కమిషనర్ ఆర్. దినకరన్ సమక్షంలో గుంటూరు సిజీఎస్‌టి ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్ ఎంపిక చేసిన సంస్థలకు అవార్డులను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, బాధ్యతా యుతమైన పన్నువిధానాల ద్వారా ఆర్థిక వృద్ధిని నడిపించడంలో పరిశ్రమల చురుకైన సహకారాన్ని ప్రశంసించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి అత్యంత ముఖ్యమైన ఆర్థిక సంస్కరణలలో ఒకటిగా పేర్కొన్నారు. దీని ద్వారా 17 పన్నులు,33 సెస్సులను ఏకీకృత చట్రంలోకి తెచ్చి 'ఒక దేశం,ఒక మార్కెట్' ఆర్థిక వ్యవస్థకు పునాది వేసిందన్నారు. ఈ సంస్కరణ పారదర్శకతను పెంచిందని, గతంలో ఉన్న సంక్లిష్టతలు అవరోధాలను తొలగించిందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు అనుకూలమైన వ్యవస్థగా మారిందన్నారు. సంస్థలు దీనిని మరింత ప్రోత్సహిస్తూ స్వావలంభన, ఆత్మనిర్భర భారత్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఆహ్వానించి నందుకు అధికారులకు ధన్యవాదములు తెలుపుతూ, శ్రీసిటీ తరహా పారిశ్రామిక కేంద్రాలలో జీఎస్టీ కీలక పాత్రను డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించారు.




బాధ్యతాయుత మైన వ్యాపార వృద్ధికి వీలుక ల్పించడంతో పాటు పారదర్శకత,సామర్థ్యాన్ని పెంపొందిం చడంలో జీఎస్టీ దోహదపడు తోందన్నారు. తిరుపతి కమిష నరేట్ పని తీరును ప్రశంసించారు. శ్రీసిటీ సంస్థకు అవార్డు రావడం ఇక్కడ స్థిరమైన అభివృద్ధి కేంద్రీకృత పర్యావరణ వ్యవస్థకు అద్దం పడుతుందని ఆయన వ్యాఖ్యా నించారు. జి.ఎస్.టి అధికారులు పరిశ్రమ వర్గాల మధ్య మరింత బలమై న సహకారాన్ని కాంక్షిస్తూ భవిష్యత్తులో శ్రీసిటీలో జిఎస్టి దినోత్సవ వేడుకను నిర్వహించాల ని ప్రతిపాదించారు.ఇసుజు మోటార్స్‌తో పాటు, అమరరాజా ఎనర్జీ మొబిలిటీ, రాక్‌మ్యాన్ ఇండస్ట్రీస్, టి టి ఈ ఎలక్ట్రా నిక్స్, ఎంఎస్ఆర్ ప్రాజెక్ట్స్, పి వి ఎస్ కెమికల్స్, లక్కీ4యు ఎగ్జిమ్స్ మినరల్స్ తదితర సంస్థలు అవార్డులు అందుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధవ్యాపార సంస్థల, పరిశ్రమల ప్రతినిధులు, టాక్స్ నిపుణులు పాల్గొన్నారు.

# పరిశ్రమల శాఖ మంత్రిని కలిసిన ఆర్యవైశ్య సంఘంనేతలు



**రామకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 01:**
రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ను కుప్పంనియోజకవర్గం రామకుప్పం ఆర్య వైశ్య సంఘంనేతలు మర్యాదపూర్వ కంగా కలిశారు. సోమవారం కర్నూలు జిల్లాలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. సందర్భంగా ఆర్యవైశ్య సంఘంఅభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి విరివిగా బ్యాంకు రుణాలు అందించి ఆర్థిక అభివృద్ధికి సహకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సంక్షేమపథకాలు అందించడం తోపాటు వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడు తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నేతలు రామ్మూర్తి,సత్య నారాయణ శెట్టి,గిరిధర్ పాల్గొన్నారు. మంత్రి భరత్ను ఘనంగా సన్మానించిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు.

# పీఈఎస్ వైద్య కళాశాలలో
## జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు




**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 01:**
కుప్పంలో పీఈఎస్ వైద్యకళాశాల జాతీయవైద్యుల దినోత్సవాన్ని మంగళ వారంరోజు కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో వైద్యుల సేవలను స్మరించుకొని, వారి సమర్పణను గౌరవించారు.ముఖ్య అతి థులందరి చేతుల ద్వారా దీపప్రజ్వలనంతో కార్యక్రమం ప్రారంభించారు. డా.హెచ్. ఆర్.కృష్ణారావు, డీన్, ప్రిన్సిపాల్, ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యుల సేవాల ప్రాధాన్యతను, వారి త్యాగభరిత జీవనశైలిని, రోగుల సంక్షేమం పట్ల వారి నిబద్ధతను ప్రస్తావించారు. పీఈఎస్ వైద్య కళాశాల వైద్య విద్యా రంగంలో చేసిన సేవలను గురించి వివరించారు."సంస్థ స్థాపితమైనప్పటి నుండి అనేక మంది ఆరోగ్య సంరక్షణ నిపుణులను రూపొందించడంలో కీలక పాత్ర పోషించింది. ఇప్పటివరకు మాసంస్థ నుండి మొత్తం 2,665 అండర్ గ్రాడ్యు యేట్ వైద్యులు (ఎంబిబిఎస్), 894 పోస్ట్ గ్రాడ్యుయేట్ స్పెషలిస్టులు (ఎండి/ఎం ఎస్) విజయవంతంగా పట్టభద్రులుగా విడుదలయ్యారు.ఈ పెరుగుతున్నపూర్వ విద్యార్థుల నెట్‌వర్క్ దేశవ్యాప్తంగా విదేశాల్లో సమాజానికి అంకితభావంతో సేవలను అందిస్తుంది." అని తెలిపారు. డా.లవి. ఎస్.ఎస్.ఆర్.ర్యాలి, వైస్ ప్రిన్సిపాల్ (అకా డెమిక్స్), డా. సుబ్రమణ్య కె,మెడికల్ సూపరింటెండెంట్, కార్యక్రమంలో ప్రసంగించి వైద్యుల సేవలను గౌరవించారు. కార్పొరేట్ రంగానికి చెందిన గిరిశంకర్, సర్కిల్ హెడ్, డిబిసి బ్యాంక్, బాలాజీ, జోనల్ హెడ్, ఆదిత్య బిర్లాలు కూడా వైద్య వృత్తి పాత్రను ప్రశంసించారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో
## పాల్గొన్న జననేత... రంగనాథ్

**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 01:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ను ఈరోజు వీకోట మండలం కుంబార్లపల్లి పంచాయతీ గెస్తంపల్లి గ్రామంలో వీకోట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జననేత రంగనాథ వృద్ధాప్య పెన్షన్లు తన చేతుల మీదుగా పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో రంగనాథ్, టీటీడీ రిటైర్డ్ సబ్ ఇన్స్పెక్టర్ పిఎం శ్రీరామప్ప, దేవరాజ్, రమేష్, విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు. పెన్షన్లు తీసుకున్న వృద్ధులు వికలాంగులు వితంతువులు కూటమి ప్రభుత్వ నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# సుపరిపాలన కార్యక్రమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు



**వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై0 1:**
పలమనేరు నియోజకవర్గం వీకోట మండలం. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి సుపరిపాలనలో ఇంటింటికి తొలి అడుగు కార్యక్రమాన్ని పలమనేరు శాసనసభ్యులు ఎన్ అమర్నాథ్ రెడ్డి అధ్యక్షతన ఇవి కోట మండలం కొంగాటం పంచాయతీలో గొప్పగా ప్రారంభిస్తున్న సందర్భంగా శాసనసభ్యులకు స్వాగతం పలికేందుకు గ్రామస్తులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# సమస్యలపై దృష్టి సాధించండి
## సర్పంచ్ హబీబ్ బాషా



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 01:**
అన్నమయ్యజిల్లా పీలేరుమేజర్ గ్రామ పంచాయతీ గ్రామసభ సర్పంచ్ హభీబ్ బాషా ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు తదితర మౌలిక సదుపాయాలు సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు సమావేశంలో ఇన్చార్జి ఈఓ లతీఫ్ ఖాన్, వార్డు సభ్యులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

# పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గాలి మురళి నాయుడు



**శ్రీకాళహస్తి,ంచిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 01:**
శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సూచనల మేరకు శ్రీకాళహస్తి తొట్టం బేడు మండలం ఇలగనూరు పంచాయతీ లో కూటమి ప్రభుత్వంఆధ్వర్యంలో వికలాంగులకు 6000 రూపాయలు, వితంతువులకు, వృద్ధులకు 4 వేల రూపాయల చొప్పున ప్రతినెల1వతారీకున ఆరు గంటలకు ఇంటి ఇంటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేస్తున్న ఘనత చంద్రబాబు నాయుడు దక్కిందని, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకు పోయినా కూటమి ప్రభుత్వం తగ్గేదే లేదంటూ పింఛన్లు పంపిణీ కార్యక్రమం, ఇంకా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గాలి మురళి నాయుడు ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వీఆర్వో చరిష్మా, సర్వేయర్ ఆరిఫ్ ఖాన్,గోగినేని భాస్కర్ నాయుడు నాని తదితరులు పాల్గొన్నారు.


# 'సూపర్‌సిక్స్' అమలుకు కట్టుబడి ఉన్నాం

-మొదటిపేజీ తరువాయి

పేదలను చులకనగా చూడొద్దని ఆదేశాలిచ్చానన్నారు. పింఛన్ తీసుకోనివారికి తర్వాతి నెలలో అందజేస్తున్నామని తెలిపారు. 'పోలవరం' పూర్తిచేసే బాధ్యతను దేవుడు మళ్లీ నాకే ఇచ్చాడు. "రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చాం. విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తామని చెప్పాం. వైకాపా హయాంలో జరిగిన విధ్వంసం నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. గతంలో వ్యవస్థలన్నీ పడకేశాయి. ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది. వైకాపా హయాంలో పోలవరం ప్రాజెక్టును భ్రష్టు పట్టించారు. డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయే పరిస్థితి వచ్చింది. పోలవరాన్ని పూర్తిచేసే బాధ్యతను దేవుడు మళ్లీ నాకే ఇచ్చాడు. ఇప్పటికే 85 శాతం పనులు పూర్తయ్యాయి. 2027 నాటికి పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. గోదావరి పుష్కరాలను కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహిస్తాం. రాష్ట్రంలోని పర్యటక ప్రాంతాలను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దుతాం. అభివృద్ధి చేస్తాం.. సంపద సృష్టిస్తాం. పెరిగిన ఆదాయాన్ని పేదలకు పంచుతాం. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే దిశగా వెళ్తున్నాం. సూపర్‌సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నాం. తల్లికి వందనం కింద రూ.10వేల కోట్లు జమ చేశాం. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. విశాఖలో నిర్వహించిన యోగాంధ్రతో 2 గిన్నిస్ రికార్డులు, 21 వరల్డ్ బుక్ రికార్డులు నెలకొల్పాం.

**గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తే తాట తీస్తా**

పోలవరానికి కేంద్రం 12,500 కోట్లు కేటాయించింది. రైల్వేజోన్ మంజూరు చేసింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,400 కోట్లు ఇచ్చి ఆదుకున్నారు. ఏడాదిలో రాష్ట్రానికి




రూ.9.5లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇప్పటికే రూ.5లక్షల కోట్ల పనులు ప్రారంభమయ్యాయి. యువతకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం. మెగా డీఎస్సీ కింద 16,500 మందికి ఉద్యోగాలు వస్తాయి. డీఎస్సీకి అనేక అడ్డంకులు సృష్టించారు. నిరుద్యోగ భృతికి త్వరలోనే శ్రీకారం చుడతాం. నిరుద్యోగ యువతకు కుటుంబపెద్దగా అండగా ఉంటా. 2029 నాటికి పేదరికం లేని సమాజాన్ని చూడటమే లక్ష్యం. ప్రతి కుటుంబానికి సంక్షేమంతో పాటు సంపాదనకు మార్గం చూపుతాం. పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఇప్పటికే లక్ష కుటుంబాలను దత్తత తీసుకున్నారు. రాష్ట్రానికి రూ.10లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. అప్పులు తీర్చాలి.. వడ్డీ కట్టాలి.. సంపద సృష్టించాలి. గంజాయి, డ్రగ్స్ తీసుకునేవారు.. విక్రయించేవారిని ఉపేక్షించేది లేదు. అలాంటి వారి తాట తీస్తా. ఆడపిల్లపై చేయి వేస్తే ఈ భూమిమీద అదే చివరి రోజు. పోలీసులు సీసీ కెమెరాలు, టెక్నాలజీ సాయంతో తప్పు చేసేవాళ్లను పట్టుకోవాలి. రౌడీయిజాన్ని సహించను. తెలంగాణలో ఆదాయం ఉన్నా.. ఏపీలో ఇచ్చే పింఛనుతో పోటీలో దరిదాపుల్లో కూడా లేదు. నూటికి 13 శాతం మందికి పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదే" అని చంద్రబాబు అన్నారు.

# ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రారంభిస్తున్నాం

-మొదటిపేజీ తరువాయి

జరిగిందని అన్నారు. 'తల్లికి వందనం' పథకం కింద రాష్ట్రంలో 67,27,164 మంది విద్యార్థులకు ఈ పథకం కింద, తల్లుల ఖాతాల్లో రూ. 8745 కోట్లు ప్రభుత్వం జమ చేయడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వం వలన 10 లక్షల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని కొనియాడారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్నా క్యాంటీన్, మెగా డీఎస్సీ, దీపం-2 పథకాలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని అని అన్నారు. మరో ముఖ్య మైన హామీ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అగస్టు 15 నుంచి అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి రూ. 2,400 కోట్లు ఆర్థిక భారమైనా కూడా ఉచిత బస్సు పథకం అమలు చేసి మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని అన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని తీవ్ర స్థాయిలో మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. ఆంధ్రప్రదేశ చరిత్రలో ఎన్నడు లేనివిధంగా రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారని, అదేవిధంగా చేసిన పనులకు రూ. 1, 35 లక్షల రూపాయిలు పాత బకాయిలు ఉన్నాయని అన్నారు. పాదయాత్ర పేరుతో ప్రజలను మోసం చేశారని, అమ్మ ఒడి పథకం అని చెప్పి ఎంత మంది ఉంటే అంత మందికి నగదును ఇస్తామని చెప్పి ఒక్కరకి మాత్రమే నగదును ఇచ్చి మోసం చేసారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో మత్స్యకారుల అభ్యున్నతిని విస్మరించారని, వారికి పరికరాలు ఇవ్వలేదని, చేపల వేట నిషేధం సమయంలో భృతి కింద రూ.10 వేలు తప్పా మరేమి ఫలితాలను ఇవ్వలేదని



ఆరోపించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డికి రాష్ట్రంలో గంజాయి బ్యాచ్‌ల వద్దకు పరామర్శలకు వెళ్లడం, బెట్టింగ్ బ్యాచ్ వ్యక్తుల విగ్రహాలను ఆవిష్కరించడం తప్పా ఇంకేం పని లేదన్నారు. వైసీపీ నేతలు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వలన రాష్ట్రాన్ని అస్తవ్యస్థం చేశారని అన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టేందుకు ఒక్క పరిశ్రమ కూడా రాలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఉన్న భూతాన్ని వెయ్యి అడుగుల లోతు గొయ్యి తవ్వి అందులో కప్పి బయటకు రాకుండా చేస్తామని తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల అభివృద్ధిని విస్మరించారని, గ్రామాల్లో ఒక్క సీసీ రహదారి కూడా శంకుస్థాపన చేపట్టలేదని, నేడు సిగ్గు లేకుండా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి గురించి అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. పరామర్శల పేరుతో నాటకాలు ఆడుతున్నారని, సొంత కార్యకర్తను కారు కిందపడి చనిపోతే పరామర్శ చేయకుండా గంజాయి బ్యాచ్ వద్దకు, అవినీతి చేసి జైళ్ళకు వెళ్లిన పలువురుని పరామర్శించడం రాజకీయ నాయకుడు లక్షణమా అని ప్రశ్నించారు.

**అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం ఉమిలాడ గ్రామం పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి అచ్చెన్నాయుడు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఉమిలాడ పంచాయతీ పరిధిలో రూ.1.62 లక్షలతో రహదారిని ప్రారంభించారు. అదేవిధంగా అంతర్గత సీసీ రహదారులు రూ. 56 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. రూ.18, లక్షలతో సీసీ రహదారి ప్రారంభోత్సవం , రూ, 14 లక్షలతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో కృష్ణ మూర్తి, పీఎసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ , తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఊహాజనిత కారణాలు చెప్పకండి

-మొదటిపేజీ తరువాయి

బీమా సౌకర్యం ఉందా? అని సీఎం రేవంత్? రెడ్డి ప్రశ్నించారు.

మానవత్వంతో వ్యవహరించాలి : ఇలాంటి సమయంలో కంపెనీ మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. పరిశ్రమలో పనిచేసే కార్మికుల నైపుణ్యం గురించి అడిగారు. నైపుణ్యం ఉన్నవారు, లేనివారి వివరాలు ఇవ్వాలని కోరారు. మంత్రులు వివేక్, రాజనర్సింహతో సమన్వయం చేసుకోవాలని అక్కడున్న కంపెనీ ప్రతినిధికి సీఎం సూచించారు.

"ప్రమాదం జరిగినప్పుడు పరిశ్రమలో 143 మంది ఉన్నారు. ఇప్పటివరకు 36 మంది కార్మికులు చనిపోయారు. 58 మంది కార్మికులు అధికారులతో టచ్‌లోకి వచ్చారు. కొందరు కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారని భావిస్తున్నాం. ప్రమాద కారణాలు ఇప్పుడే చెప్పలేం. ప్రమాద ఘటనపై నిపుణుల కమిటీతో దర్యాప్తు చేయిస్తున్నాం. మృతుల కుటుంబాలకు రూ.లక్ష, క్షతగాత్రులకు రూ.50 వేలు తక్షణ సాయం అందిస్తాం" -సీఎం రేవంత్? రెడ్డి

24 గంటలు దాటినా రాని సిగాచీ యాజమాన్యం : బాయిలర్లలో సమస్యలు ఏమైనా గుర్తించారా? సమస్యలను పరిశ్రమ దృష్టికి తీసుకెళ్లారా?అని సీఎం రేవంత్? రెడ్డి ప్రశ్నించారు. ప్రమాద కారణాలను ఊహాజనితంగా



భద్రతా చర్యలపై వివరాలు సేకరించాలని, ప్రమాద ఘటనను నిపుణులతో అధ్యయనం చేయించాలని సీఎం రేవంత్? ఆదేశించారు. కారణాలు తెలుసుకునేందుకు నిపుణుల కమిటీ నియమించాలని, నిపుణుల కమిటీలో కొత్తవారికి చోటు కల్పించాలని తెలిపారు. ప్రమాద ఘటనపై సిగాచీ కంపెనీ యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు,

చెప్పవద్దని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగి 24 గంటలు దాటినా పరిశ్రమ యాజమాన్యం రాకపోవడంపై పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని తెలిపారు. ప్రమాద ఘటనను కార్మిక, వైద్యారోగ్య శాఖ మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు

నిపుణుల కమిటీతో అధ్యయనం : పరిశ్రమ నిర్వహణ, క్షతగాత్రులకు ఇచ్చే పరిహారం విషయంలో నిర్ణయం చెప్పాలని కంపెనీ ప్రతినిధికి సీఎం సూచించారు.

సుమోటోగా : పాశమైలారం ఘటనను రాష్ట్ర మానవ హక్కుల సంఘం సుమోటోగా స్వీకరించింది. జులై 30లోగా పేలుడు ఘటనపై నివేదిక ఇవ్వాలని ఫైర్ డీజీ, సంగారెడ్డి కలెక్టర్, ఎస్పీ, లేబర్ కమిషనర్‌లకు హెచ్?ఆర్?సీ ఆదేశాలు జారీ చేసింది.

## రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన



-మొదటిపేజీ తరువాయి

అంశాలపై అధికారులతో చర్చించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హమైన వాటిని పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై సరైన విచారణ జరపాలని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని మంత్రి సూచించారు. అవసరమైన డాక్యుమెంట్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలన్నింటినీ ఒకే డాక్యుమెంట్‌గా భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను ఎందుకు తిరస్కరించాల్సి వచ్చిందో వివరాలను రాతపూర్వకంగా దరఖాస్తుదారులకు పంపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 594 మండలాల్లో 10,226 రెవెన్యూ సదస్సులు నిర్వహించి తద్వారా వచ్చిన 8,27,230 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 7,98,528 దరఖాస్తుల డేటాను భూభారతి పోర్టల్‌లో నమోదు చేసినట్లు మంత్రి వివరించారు. మిగిలిన వాటిని కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఏప్రిల్ 17 నుంచి జూన్ 20 వరకు దశల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించినట్లు వివరించారు. సర్వే నంబర్లలో లోపాలు పీపీబీ, ఆర్వోఆర్, నాలా, ఆర్ఎస్ఆర్ సవరణ, అప్పీల్స్, కోర్టు కేసులు, పోడు భూములు తదితర 30 రకాల భూ సమస్యలకు చెందిన 8.27 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## సిగాచి మృతులకు కోటి రూపాయల పరిహారం: సీఎం రేవంత్




**సంగారెడ్డి:** ఇంతటి ఘోర ప్రమాదం తెలంగాణలోనే కాదు.. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇప్పటిదాకా జరగలేదని పటాన్‌చెరు పాశమైలారం ఫ్యాక్టరీ ప్రమాదాన్ని ఉద్దేశించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం సిగాచి ఫ్యాక్టరీ ప్రమాద స్థలిని పరిశీలించి.. అధికారులతో సమీక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సిగాచి ఫ్యాక్టరీలో ప్రమాదం జరగడం బాధాకరం. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో 147 మంది ఉన్నారు. ప్రమాదం నుంచి 57 మంది బయటపడ్డారు. అన్ని శాఖల సమన్వయంతో రెస్క్యూ నిర్వహిస్తున్నాం. చనిపోయినవారి కుటుంబాలకు రూ.1 కోటి నష్టపరిహారం అందించాలని ఆదేశించాను. ఈ విషయమై ప్రభుత్వం తరపున మంత్రులు ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించనున్నారు. అలాగే.. తీవ్రంగా గాయపడిన వాళ్లకు రూ.10 లక్షల సాయం అందించాలని ఆదేశించాను. గాయపడి.. కోటుకుని తిరిగి పని చేయలేని స్థితిలో ఉన్నబాధితులకు సైతం రూ.10 లక్షలు కచ్చితంగా ఇప్పిస్తాం. తక్షణ సాయం కింద తెలంగాణ ప్రభుత్వం నుంచి మృతుల కుటుంబాలకు రూ.లక్ష, గాయపడినవాళ్లకు రూ.50 వేలు అందిస్తాం. బాధితులను ఆదుకునేందుకు యాజమాన్యం ముందుకు రావాలి. బాధిత కుటుంబాలను ప్రభుత్వం మానవత్వంతో అన్ని విధాల ఆదుకుంటుంది. మృతుల్లో తమిళనాడు, బీహార్, జార?ండ్ వాసులు అధికంగా ఉన్నారు. మృతదేహాల స్వస్థలాల తరలింపునకు కూడా ప్రభుత్వం సాయం అందిస్తుంది. మృతుల కుటుంబాల పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుంది. ..ఇలాంటి ప్రమాదం తెలంగాణలో ఇప్పటిదాకా జరగలేదు. యాజమాన్యాలు ఇక నుంచి భద్రతపై ఫోకస్ చేయాలి. ప్రమాదాలను నివారించాలి. ప్రమాదాలు జరగకుండా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. నిర్లక్ష్యం ఉంటే కచ్చితంగా కఠిన చర్యలు ఉంటాయి. ఇప్పటకే ప్రభుత్వం తరపున అత్యున్నత దర్యాప్తు జరిపిస్తున్నాం అని సీఎం రేవంత్ అన్నారు.

## రేవంత్‌కు జ్ఞానోదయం చేసింది బీఆర్ఎస్ పార్టీయే కదా..

-మొదటిపేజీ తరువాయి

మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి ఘాటుగా స్పందించారు. గోదావరిలో వెయ్యి టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు చాలు అని చెప్పిన రేవంత్‌కు మిగులు జలాల్లోనూ తెలంగాణకు వాటా ఉంటుందని జ్ఞానోదయం చేసింది కూడా బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. మళ్లీ అవే పాత



అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని.. అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఇప్పటికీ ఎందుకు డిమాండ్ చేవని ప్రశ్నించారు. చంద్రబాబుపై నువ్వు చూపుతున్న గురు భక్తికి ఇది నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. గోదావరి వాటర్ డిస్ప్యూట్ బోర్డ్ అవార్డు ప్రకారం.. సీడబ్ల్యూ అనుమతి పొందకుండా ఈఏసీ అనుమతి ఇవ్వదన్నారు.

ఏపీ అనుమతుల కోసం సీడబ్ల్యూసీకి వెళ్లే కంటే ముందే అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లాలనే సోయి కూడా సీఎంకు లేదని విమర్శించారు. కనీస అవగాహన లేని వ్యక్తులు నీటి పారుదల శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యమన్నారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రస్తావనే రాని బనకచర్ల ప్రాజెక్టు.. ఇప్పుడు ఎవరి అండ చూసుకొని ముందుకు వచ్చిందో తెలంగాణ ప్రజలకు తెలియదా? అని ప్రశ్నించారు. మౌనంగా ఉంటూ అందిస్తున్న సహకారం వల్లనే కదా బనకచర్ల వ్యవహారం ఇక్కడి దాకా వచ్చింది రేవంత్ రెడ్డి అంటూ చురకలంటించారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో అన్యాయం చేస్తూనే.. లెక్కకు మించి అబద్ధాలు ప్రచారం చేస్తూ.. బీఆర్ఎస్‌పై చేస్తున్న క్షుద్ర రాజకీయాన్ని తెలంగాణ సమాజం గమనిస్తుందని.. తెలంగాణ వ్యతిరేక విధానాలను అసహ్యించుకుంటున్నారన్నారు.

## పెద్దపులి గంగమ్మకు అభిషేకం ఉత్సవ పూజ కార్యక్రమం



**వి.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 01:**
వి.కోటమండలం పాముగానిపల్లి పంచాయతీ గుమ్మిరెడ్డి పల్లిగ్రామంలో నూతనంగా వెలసిన పెద్దపులి గంగమాంభ దేవాలయంలో నాగరాజు గౌడు కుదవగడ్డ గ్రామస్థులు అభిషేకం, ఉత్స వ పూజచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ కమిటీ సభ్యులు రూపాకుమార్ రాజు, శంకర్ రెడ్డి, కుమార్ రాజు, శామ్ రెడ్డి, భరత్ రెడ్డి, లక్ష్మీపతి అర్చకులు కృష్ణా స్వామి పూజాకార్యక్రమాలు చేసారు. ప్రధాన ఆర్చకులు భాస్కర్ శర్మ ఇదేవిధంగా ప్రతి మంగళవారం వి.కోట మండలంలో ఉన్నటువంటి భక్తాదులు చుట్టుపక్కల ఉన్నటువంటి ప్రాంతస్తులు గ్రామ స్తులు పెద్దపులి గంగమ్మ తల్లికి పాత్రులై వారి ఆశీస్సులు పొందుతూ అభిషేకలు చేసు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ ధర్మకర్త పురుషోత్తం నాయుడు వారికి తీర్థ ప్రసా దాలు అందజేశారు.

## చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి..
### మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై01:**
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతున్నదని మంగుంట మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి అన్నారు. జూలై ఒకటో తేదీ మంగుంట పంచాయతీలో వృద్ధు లకు వికలాంగులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీసర్పంచ్ భూపతిరెడ్డి మాట్లాడు తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలుఅమలు చేస్తున్నాడని ప్రజలం దరూ చంద్రన్నపాలన బాగుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మారయ్య వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలన విజయవంతం చేయండి... గంధమనేని



**ఎస్ఆర్ పురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,జూలై 01:**
తెలుగుదేశం పార్టీ సుపరిపాలనను విజయవంతం చేయాలని ఎస్ఆర్ పురం మండల అధ్యక్షుడు గంధమనేని జయ శంకర్ నాయుడు అన్నారు. మంగళవారం ఎస్ఆర్ పురం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల నాయకులతో సుపరిపాలనపై సమావేశం నిర్వహించా రు. టిడిపి ప్రభుత్వం చేస్తున్నఅభివృద్ధి, గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రజలకుతెలియ జేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు,గంధమనేని రాజశేఖర్ నాయుడు, భాస్కర్ నాయుడు, మాజీ ఎం పీటీసీ వేమన నాయుడు, మండలఉపా ధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, పైనేని మురళి, నియోజకవర్గ ఎస్సీసెల్ కార్యదర్శికుమార్ ఆర్టిఐ జిల్లా అధ్యక్షుడు జయరాజ్, ఎన్. కుమార్ చంద్రబాబు నాయుడు, మోహన్ నాయుడు,సూరి రెడ్డి, బాలాజీ నాయుడు, పవన్, లోకేష్, దసరాజూ రామిరెడ్డి, అప్పలరాజు, ఢిల్లీ, పైనేని ధనుంజయ నాయుడు, సోము పుల్లూరు దాము, తదితరులు పాల్గొన్నారు.

## పి.వి.ఎన్.మాధవ్ నిమర్యాద పూర్వకంగా కలిసిన పాముల శేషాద్రి కుమార్



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 01:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన పి.వి.ఎన్.మాధవ్‌ని చిత్తూరు జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి ఆశీస్సులు వీరిపై మెండుగా ఉండాలని కోరుకున్నరు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం



**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 01:**
వెదురుకుప్పం మండలం చిన్నమరెడ్డికండ్రిగ హరిజనవాడ గ్రామం నందు బెడ్ రీడన్ పేషంట్ సి.ధనమ్మకి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తున్న వెదురుకుప్పం క్లస్టర్ ఇంచార్జి, మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోహన్ మురళిమరియు సచివాలయ సిబ్బంది. సతీష్ దయా కర్, హైమావతి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా తేదేపా



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జులై 01:**
చౌడేపల్లి మండలం కాటిపేరి పంచాయతీలో పుంగనూరు తెలుగుదేశం ఇంచార్జ్ చల్లా రామ చంద్రారెడ్డి, ఆదేశాల మేరకు చౌడేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి సూచనల మేరకు కాటిపేరి గ్రామ పంచాయ తీలో కాటిపేరి ప్రజల దాహర్తిని తీర్చటమే లక్ష్యంగా భావించి కాటిపేరి గ్రామం అధ్యక్షుడు సి.సుబ్రమణ్యం రెడ్డి ఆధ్వర్యంలో కాటి పేరి చెరువులో బోర్ వేయటం జరిగింది. నీళ్లు పుష్కలంగా నీళ్లు రావడంతో గ్రామ స్తులు సంతోషంవ్యక్తం చేశారు. చల్లాబాబు ఆదేశాలతో గువ్వలరమేష్ రెడ్డి సూచనలతో తొందరగా బోర్ మోటర్ పెట్టి పైప్ లైన్ వేసి నీటిని కాటిపేరి ప్రజలకు అందజేస్తా మని కాటిపేరి గ్రామం అధ్యక్షుడు సి.సుబ్రహ్మణ్యం రెడ్డి తెలియజేశారు.

## టిడిపి మాజీసర్పంచ్ సెల్వరాజ్ పుట్టినరోజు వేడుకలు



**పలమనేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై 01:**
చిత్తూరుజిల్లా పలమనేరురూరల్ మండలం కొలమాసనపల్లి పంచాయతీ తెలుగు దేశం పార్టీ మాజీ సర్పంచ్ బి.సెల్వరాజ్ 53 వ పుట్టినరోజు వేడుకలు కొలమాసన పల్లిలోని రామాలయం దేవస్థానం నందు మంగళవారం తెలుగుదేశంపార్టీ కుటుంబ సభ్యులు మరియు కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సెల్వరాజ్ మాట్లాడుతూ నాపై అభిమానంతో ఇంత మందివచ్చి నాకుపుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసినందుకు చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు. మన పంచాయతీకి సంబంధిం చి మన పార్టీ కుటుంబ సభ్యులలో ఏ ఒక్క కార్యకర్తకు సమస్య వచ్చినా ముందుకు ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు నాగరాజు రెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్,మాజీ జడ్పిటిసి వెంకటరత్నం,కొలమాసనపల్లి మాజీ సర్పంచ్ హేమసుందరం,టిడిపి మాజీ జిల్లా మహిళాఅధ్యక్షురాలు మంజులమ్మ,రూరల్ మండలం బిసి సెల్ అధ్యక్షులు గిరి, యూత్ ప్రెసిడెంట్ వెంకటమునిరెడ్డి, రూరల్ మండలం మైనార్టీ సెల్ అధ్యక్షులు షరీఫ్,రూరల్ మండలం ఐటిడిపి అధ్యక్షులు శీను తదితరులు పాల్గొన్నారు.

## సిఎన్ఆర్ కాలేజీలో ఘనంగా
## జాతీయ వైద్యుల దినోత్సవం



**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, జూలై01:**
అన్నమయ్యజిల్లా పీలేరు జాతీయ వైద్యుల దినోత్సవం పీలేరులోని సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో జరుపుకోవడం సంతోషంగా ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ మమతలక్ష్మి అన్నారు. డాక్టర్ నాగవేణి మాట్లాడుతూ విద్యార్థులు మంచి పౌష్టికాహారం తీసుకొని హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుకోవడంతో పాటు రక్తహీనత నివారణ పై అవగాహన కల్పించడం జరిగింది.డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు పీలేరు ఏరియా హాస్పిటల్ ద్వారా ఫోలిక్ యాసిడ్, ఐరన్ మాత్రలను సరఫరా చేస్తామని డాక్టర్లు నిర్దేశించిన మోతాదులో మూడు నెలల పాటు ఉపయోగించి రక్తహీనతను అధిగమించాలని అన్నారు. సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి బృహత్ కార్యక్రమాన్ని తమ కాలేజీలో ఏర్పాటు చేయడం, తమ విద్యార్థిని విద్యార్థులకు రక్తహీనత గురించి వివరించి హిమోగ్లోబిన్ నిర్ధారణ పరీక్షలు కూడా నిర్వహించినందుకు ధన్యవాదాలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, పీలేరు ఏరియా హాస్పిటల్ ల్యాబ్ టెక్నీషియన్ మునాఫ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## మిట్టూరులో తీరిన దాహార్తి
## ఆనందంలో గ్రామస్తులు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,జులై 01:**
చౌడేపల్లిమండలంలోని పుధిపట్ల పంచాయతీ మిట్టూరు గ్రామంలో సంవత్సరాల తరబడి త్రాగు నీటిసమస్య నెలకొని ఉంది. ఈ సమస్యపైగతంలో పాలకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారు పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు అన్నారు. మంగళవారం గ్రామంలోని మంచినీటి సమస్య తీర్చడం కోసం వేసిన బోరులో సమృద్ధిగా నీరుపడటంతో గ్రామస్తుల్లో ఆనందం నెలకొని ఉంది, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి చొరవతో నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆదేశాలమేరకు మిట్టూరులో త్రాగునీరుకోసం బోరువేశారులో సమృద్ధిగా,నీరు రావడంతో గ్రామస్తులు వారికి అభినందనలు తెలిపారు. ఏళ్ల తర బడి నెలకొని ఉన్న దాహార్తి తీరినందుకు గ్రామస్తుల్లో ఆనంద ఉత్సాహాలు నెలకున్నాయి.

# సంపాదకీయం

## సర్కారు కళాశాలలపై నమ్మకం సన్నగిల్లుతోందా?

ఒకప్పుడు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ లభించాలంటే చాలా కష్టపడాల్సి ఉండేది. కానీ ఇప్పుడు ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలతో ప్రయివేటు, కార్పొరేట్ విద్య అంతకంతకూ పెరుగుతోంది. దీంతో ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల సంఖ్య తగ్గుతూ వస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లకు కొదవలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కాలేజీల్లోనే ఈ పరిస్థితి ఉంది. అందులో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లోనే ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అలాగే ప్రభుత్వ రంగంలోని హైస్కూల్స్, జడ్పీ స్కూళ్లతో ప్రభుత్వ కళాశాల మధ్య సమన్వయం కూడా తగ్గిపోతోంది. ఈ ప్రభావం కళాశాలల్లో విద్యార్థులు తగ్గడానికి కారణమవుతోంది. దీంతోపాటు చాలామంది విద్యార్థులు క్రమంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి ప్రయివేటుకు, కార్పొరేట్‌కు ఇంటర్ విద్య నెట్టివేయబడిన పరిస్థితి కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతంలో హైస్కూల్ విద్య వరకు చదివిన విద్యార్థులు, డ్రాపౌట్ అవుతూ ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్ చదవటం లేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వచ్చిన వారు కుటుంబ సామాజిక, ఆర్థిక పరిస్థితుల కారణంగా, చాలామంది విద్యార్థులు వారి కుటుంబంలో వారు మాత్రమే ప్రభుత్వ ఇంటర్ పూర్తి చేస్తున్నారు. ఆ తర్వాత వారు ప్రయివేటు కార్పొరేట్ స్కూళ్లవైపు మొగ్గుచూపడం ఎక్కువగా ఉన్నది. దీనికి ఉన్నత విద్యారంగంలో వచ్చిన మార్పులు కూడా ఒక కారణం. నూతన ఆర్థిక విధానాల ప్రభావం కూడా కొంత ప్రభావం చూపింది. కార్పొరేట్ కళాశాలల ప్రచారం వలన ప్రభుత్వ జూనియర్ కళాశాలల మీద తల్లిదండ్రులకు నమ్మకం సన్నగిల్లుతోంది. దీన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అది చేయకపోవడం వలనే రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాల వారు తమ పిల్లల చదువులకు అప్పులు చేసి అవస్తలు పడుతున్నారు. కార్పొరేట్ మాయలో పడి తమ కుటుంబ వార్షికాదాయంలో అత్యధిక డబ్బు చెల్లిస్తూ నష్టపోతున్నారు. ఈ యాజమాన్యాలకు పాలకులతో అత్యంత సన్నిహిత రాజకీయ సంబంధాలు ఉన్నాయి! ప్రభుత్వ విధానాలు నిర్ణయించే ఈ నేతలు ప్రత్యక్షంగా, పరోక్షంగా కార్పొ రేట్, ప్రయివేటు కళాశాలల నిర్వహణలో భాగస్వామ్యమవుతున్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యలో ఇంటర్మీడియెట్ ఒక పెద్ద వ్యాపార వస్తువుగా మారిదంటే దానికి కారణం పాలకుల మద్దతే! దీంతోనే తక్కువ పెట్టుబడితో ఎక్కువ మొత్తం సంపాదించే మార్గంగా కార్పొరేట్ కళాశాలల యాజమాన్యం మారిపో యింది. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ విద్యార్థులే 99 శాతం మంది చేరుతున్నారు. ఉన్నత వర్గాల వారు చేరటం లేదు. ఇందులో పౌర సమాజం, ప్రజల భాగస్వామ్యం తగ్గుతోంది. రాష్ట్రంలో గత 2024 -25 విద్యా సంవత్సరంలో సుమారు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 9,97,012 పైగా విద్యార్థులు వివిధ మేనేజ్‌మెంట్ల నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో మొత్తం సుమారు 3019 (వివిధ మేనేజ్‌మెంట్‌ల)లో 424 ప్రభుత్వ జూనియర్ కళాశాలల (ప్రస్తుత విద్యా సంవత్సరంలో 440 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు) సుమారు జనరల్, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి లక్షా 70 వేల మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం 9,97,012 మంది వార్షిక పరీక్షలకు హాజరయ్యారు. ప్రభుత్వం విద్యారంగంలో మార్పులు తీసుకురావడం కోసం తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయడం ఆహ్వానించాల్సిన అంశం. రాష్ట్రంలో సుమారు పదిలక్షల మంది విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులతో సంబంధం ఉన్న ఉన్నత విద్యలో కీలకమైన ఇంటర్‌పై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం మంచి విషయం. అయితే ఇంటర్ విద్యను కార్పొరేట్ శక్తుల నుంచి కాపాడి అందరికి అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ కళాశాలలను అభివృద్ధి చేయాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 కమిషన్‌కు పలు సూచనలు చేసింది.అందులో ముఖ్యమైనవి ఏమిటంటే? ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ బోధనలో పటిష్టమైన ప్రణాళికలుండాలి. సమాజ అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను, సిలబస్‌ను మార్చాలి. ఒకేషనల్ విద్యలో కొత్త కోర్సులకు ప్రాధాన్యతనివ్వాలి. ఆర్ట్స్ కోర్సులు చదివిన విద్యార్థులకు మంచి భవిష్యత్ అవకాశాలు ఉండే విధంగా సిలబస్‌ను మార్పుచేసి ప్రణాళికలు రూపొందించాలి. కళాశాలలకు లాభార్జన దృష్టితో కాకుండా దీర్ఘకాల సమాజాభివృద్ధి దృష్టితో చూసి నిధులివ్వాలి. రాష్ట్ర బడ్జెట్‌లో పదిహేను శాతం నిధులు కేటాయించాలి. విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్‌లు ప్రతినెలా అందించాలి. మధ్యాహ్నం భోజన పథకం కూడా ప్రవేశపెట్టాలి. విద్యార్థినీ విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలి. ఇది లేకపోవడం వలన చాలామంది బాలికలు పదోతరగతి వారి గ్రామంలోనే చదువుకొని, ఆ తర్వాత ఉన్నత చదువులు చదవలేక డ్రాపౌట్ అవుతున్న పరిస్థితి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు (కామన్ యూనిఫామ్) ఏకరూపు దుస్తులు పంపిణీ చేయాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అటెండెన్స్ ప్రతిరోజు వారి తల్లిదండ్రులకు సెల్ ఫోన్‌కు మెసెజ్ ద్వారా పంపించేటట్లు ఆధునిక పరికరాలు అందచేయాలి. విద్యార్థుల ప్రగతి నివేదన రిపోర్టు (ప్రోగ్రెస్ కార్డు) ప్రతినెలా తల్లిదండ్రులకు ఇవ్వాలి. కళాశాల అధ్యాపకుల్ని ప్రభుత్వ యాజమాన్యంలోని హైస్కూళ్లకు నోడల్ ఆఫీసర్‌గా కేటాయించాలి. హైస్కూల్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులతో సమన్వయంగా ఉండాలి. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి హైస్కూల్ కళాశాల మధ్య సమన్వయం పెంచుకుని, వివిధ రకాలైన యాక్టివిటీస్ సంబంధిత జూనియర్ కళాశాల నుంచి పదోతరగతి విద్యార్థులకు పరిచయం చేయాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి గురించి అయా నియోజకవర్గం ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మూడునెలలకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహించాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల మానసిక, శారీరక వికాశానికి తరచుగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు నిర్వహించాలి. జిల్లాలో ఇంటర్ విద్యను పర్యవేక్షించడానికి 26 మంది డి.ఐ.ఇ.ఓ. (డిస్ట్రిక్ట్ ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్) పోస్టులను మంజూరు చేసి వెంటనే భర్తీ చేయాలి.రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన సుమారు 36 జూనియర్ కళాశాలలకు ప్రిన్సిపాల్ అండ్ టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల్ని కేటాయించాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక లేదా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కాకుండా శాశ్వత ప్రాతిపదికన నియామకాలు ఉండాలి. క్రమబద్ధీకరణ కాకుండా ఆగిపోయిన ఒకేషనల్ కాంట్రాక్స్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి. గెస్ట్ ఫ్యాకల్టీకి రెమ్యునరేషన్ పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రతి జూనియర్ కళాశాలలో స్వీపర్, స్కావెంజర్‌ను నియమించాలి. ప్రతి కళా శాలలో విద్యార్థినీ, విద్యార్థులకు టాయిలెట్ సౌకర్యం కల్పించాలి. ప్రహరీ, గేటు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంసెట్ మొదలగు కోర్సులకు సరైన విధంగా నిర్వహించాలి.ప్రభుత్వ ఇంటర్ విద్య సమూల ప్రక్షాళన జరగాలంటే, విద్యార్థుల అడ్మిషన్ల సంఖ్య పెరగాలంటే ప్రభుత్వం ఈ సూచనల్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143